ప్రజాశక్తి
బుధవారం 2 జులై 2025 5 అనంతపురం



మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-ఉరవకొండ



వెలిగొండ గ్రామంలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ డా॥వినోద్‌కుమార్

ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఉరవకొండ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ తిప్పే నాయక్, బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఉరవకొండ మండల ప్రత్యేక అధికారిణి ఖుష్బుకొఠారి, తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో రవి ప్రసాద్‌తో కలిసి మంగళవారం ఉదయం ఉరవకొండ మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గ్రామస్తులకు కలెక్టర్ సూచించారు. మొక్కలు ఎక్కువగా ఉంటే వర్షాలు కురుస్తుయాని, తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అంతకు మునుపు ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. వెలుగొండ గ్రామ పంచాయతీకి సంబంధించి చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రంలో రూ.56,271 నిధులతో అదనంగా మూడు చెత్త నింపే తొట్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వెలిగొండ గ్రామంలో తాగు నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సుజాత, పంచాయతీ సెక్రటరీ వంశీ, సర్పంచి వీరాంజనేయులు, ఎంపిపి.నరసింహులు, టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్, పాల్గొన్నారు.

ఆనాడు రూల్ ఆఫ్ లా ఏమైంది.?

- నాకు పెద్దారెడ్డే సమస్య
- ఇతర వైసిపి నాయకులతో నాకు మంచి సంబంధాలు
- తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



విలేకరులతో మాట్లాడుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లలో రూల్ ఆఫ్ లా ఏమైందని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. తమపై ఎటువంటి కేసులు నమోదు చేసి ఇబ్బందులు పెట్టారో గుర్తుకు లేవా అని మండిపడ్డారు. అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో మంగళవారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గడిచిన ఐదేళ్లలో నిబంధనలకు విరుద్ధంగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకోలేదా అని ప్రశ్నించారు. కేతిరెడ్డి కాలనీలో భార్య పేరు మీద రిజిస్ట్రేషను చేసుకున్నారని, వాటిని ఆధారాలతో సహా అప్పటి కలెక్టర్ నాగలక్ష్మికి ఇస్తే ఎటువంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు. ఆయన ఇళ్లు కూడా నిబంధనలకు విరుద్ధంగానే నిర్మాణం జరిగిందన్నారు. వంద ఎకరాలకుపైగా గాలిమరలకు కేటాయించిన భూములకు ఏ రకంగా పాసుపుస్తకాలు తీసుకున్నారో చెప్పాలన్నారు. ఒక్కసారి కన్వర్షన్ అయిన తరువాత ఆ భూమి సాగు భూమిగా ఉండదన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. వాటిపై చర్యలు తీసుకుంటామని చెబితే తానేదో ఇబ్బంది పెడుతున్నట్లు చెబుతున్నారన్నారు. గతంలో తమ అనుయాయుడు రవీంద్రారెడ్డికి కూడా కోర్టు అనుమతిచ్చినా తాడిపత్రిలోకి రానిచ్చారా అని ప్రశ్నించారు. ఇప్పుడేమో పెద్దారెడ్డిని రానివ్వకపోవడం అన్యాయం అని చెబుతున్న వైసిపి నేతలకు ఇవి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో తనపై నిబంధనల ప్రకారమే కేసులు పెట్టారా అని నిలదీశారు. అశోక్ లైల్యాండ్ వాహనాల కొనుగోలు విషయంలో తనపై కేసులు పెట్టారు...కాని వాటిని అమ్మిన హిందూజా సంస్థ పేరు కూడా కేసులో ఎందుకు లేదో చెప్పాలన్నారు. మోటర్ వెహికల్ యాక్టులో ఏముందో చెప్పాలని నిలదీశారు. తనకు ఇతర వైసిపి నాయకులపై ఎటువంటి కోపం లేదని, కేవలం కేతిరెడ్డి పెద్దారెడ్డిపై మాత్రమే ఉందన్నారు. ఆయన గత ఐదేళ్లలో చేసిన వ్యవహారాలపైనే తాను చర్యలు తీసుకోవాలని అడుగుతున్నట్లు చెప్పారు. ఆయనకు మద్దతుగా వస్తున్న వైసిని నాయకులు ఈ విషయాలను గ్రహించాలని తెలిపారు.

జాకీ భూములు వెనక్కి..!

- కేటాయింపులు రద్దు చేస్తూ ఉత్తర్వులు
- ఆది నుంచి దీనిపై వివాదమే..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



జాకీ (పేజ్ ఇండస్ట్రీస్)కు కేటాయించిన భూములను వెనక్కు తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. జాకీ పరిశ్రమ ఏర్పాటవకపోవడంపై గతంలో పెద్దఎత్తున రాజకీయ దుమారం రేగింది. అప్పటి వైసిపి నాయకుల వల్లే ఈ పరిశ్రమ వెనక్కు వెళ్లడానికి కారణంటూ ప్రతిపక్షంలో ఉండగా టిడిపి విమర్శలు చేసింది. వారి హయాంలోనే రాకుండా పోయాయని వైసిపి కూడా ప్రతార్యోపణలు చేస్తూ వచ్చింది. మొత్తంగా సంస్థ ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుకు పనులు ప్రారంభించి మధ్యలోనే ఆపేసి వెళ్లిపోయింది. ఈ నిర్ణయంతో అనంత పురం నగరం, రాప్తాడు మధ్య రావాల్సిన జాకీ గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటవ కుండానే వెళ్లిపోయినట్టయింది.



'జాకీ' కథ ఇది

అనంతపురం జిల్లాలో 'జాకీ' పేజ్ ఇండస్ట్రీస్ సంస్థ తమ ఉత్పత్తులను తయారు చేసుకోవడానికి పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. వారి అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2018 జూన్ 21వ తేదీన అనంతపురం, రాప్తాడు మధ్యలో జాతీయ రహదారి 44కు అనుకుని 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎపిఐఐసి ద్వారా పేజ్ ఇండస్ట్రీస్‌కు కేటాయించింది. ఆ సంస్థ పనులు ప్రారంభిస్తున్న సమయంలోనే ఎన్నికలు రావడం 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన ఆ తరుణంలో నేతల ఒత్తిడి మేరకు ఆ సంస్థ పనులను నిలిపివేసినట్టు ఆరోపణలున్నాయి. ఈ మేరకు ఆ సంస్థ 2019 డిసెంబర్‌లో ఆ సంస్థ ఇక్కడ తాము వివిధ కారణాల రిత్యా పరిశ్రమను ఏర్పాటు చేయలేమని ఎపిఐఐసి లేఖ రాసింది. కావున ఈ భూమిని సరెండర్ చేయడానికి సిద్ధంగానున్నట్టు అందులో పేర్కొంది. అనంతరం ఆ పరిశ్రమ తెలంగాణలో ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి భూమిని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదు. ఇప్పుడు ఆ భూమిని ఇతర పారిశ్రామిక అవసరాల కోసమంటూ స్వాధీనం చేసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

రేమండ్స్ ఇదేనా ?

పేజ్ ఇండస్ట్రీస్ సంస్థ రద్దయిన స్థానంలోనే రేమండ్స్‌కు కేటాయించే అవకాశాలున్నాయి. ఇటీవలే రేమండ్స్ సంస్థ రాప్తాడులో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ మేరకు అనుమతులిస్తూ ఉత్వర్వులిచ్చారు. ఈ సంస్థకు 25 ఎకరాల భూమిని కేటాయించారు. ఏ భూములు అన్నది ఇంకా నిర్ణయించలేదు. ఈ భూములు పేజ్ ఇండస్ట్రీ నుంచి స్వాధీనం చేసుకున్నందున దీన్ని కేటాయించే అవకాశముంది.

ఫిర్యాదు చేశా.. కుట్ర చేయలేదు..!

ఈ స్టాంప్ వ్యవహారంపై టిడిపి నాయకులు మారుతీ చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇ-స్టాంపుల ట్యాంపరింగు విషయం తన దృష్టికి వస్తే రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఐజి దృష్టికి తీసుకెళ్లాను తప్ప కుట్రదారుడిని కాదు అని టిడిపి నాయకులు మారుతీ చౌదరి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇ-స్టాంపుల కుంభకోణం బయటకు రావడంలో మారుతీచౌదరి కుట్రదారుడని డీఎస్పీ కొన్ని మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారని తెలిపారు. దానిపై వివరణ ఇవ్వడానికే తాను మాట్లాడుతున్నట్టు తెలిపారు. తాను కుట్రదారుడిని కాదని.. ప్రభుత్వ ఆదాయానికి గండిపెడుతున్న విషయం తనకు తెలియగానే రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. దానిపై విచారణ చేపట్టిన క్రమంలోనే కళ్యాణదుర్గంలో మీసేవా బాబు వ్యవహారం బయటకొచ్చిందన్నారు. ఇందులో ప్రధాన బాధితురాలు ప్రభుత్వమే అన్నారు. మీసేవా బాబు గతంలో వైసిపిలో ఉంటూ మంత్రి ఉషశ్రీచరణ్‌కు ముఖ్య అనుయాయుడిగా ఉండేవాడని చెప్పారు. ఇతను చేసిన మోసం తన దృష్టికి రావడంతో విషయాన్ని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యే అమిలినేనిపై తానెందుకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. వారు కూడా ఇందులో బాధితులుగానే ఉన్నారని వివరనిచ్చారు. మీసేవా బాబు కూడా టిడిపిలో ఉన్నారన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ పొద్దుతిరుగుడు లాంటి వారు కొందరుంటారని, అందులో మీసేవా బాబు ఒక్కడన్నారు. ఆయన మోసాలకు టిడిపికి సంబంధం లేదని పేర్కొన్నారు.



నిదనవాడ గ్రామం పెన్నానది పరీవాహక ప్రాంతం వద్ద టిప్పర్‌ను అడ్డుకుని, అక్కడే వంటా వార్పు చేస్తూ నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



పోలీసులు, అధికారులను నిలదీస్తున్న నిదనవాడ గ్రామస్తులు

అక్రమ ఇసుక రవాణాపై జనాగ్రహం

- నిదనవాడ పెన్నానది వద్ద గ్రామస్తుల ఆందోళన
- టిప్పర్లు, జెసిబిల అడ్డగింత... అక్కడే వంటావార్పు
- ఇసుక తరలిస్తే ప్రత్యక్షదాడులకైనా సిద్ధం
- అధికారుల హామీతో శాంతించిన గ్రామస్తులు

ప్రజాశక్తి-శింగనమల

పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై గ్రామస్తుల ప్రజాగ్రహం వ్యక్తం అయ్యింది. గత కొన్ని రోజులుగా శింగనమల మండలం నిదనవాడ గ్రామం పెన్నానది పరీవాహక ప్రాంతం నుంచి కొందరు పెద్ద ఎత్తున టిప్పర్లు, జెసిబిలు, హిటాచీలు ఏర్పాటు చేసి ఇసుకను తరలించుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో పలుమార్లు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వందలాది టిప్పర్లతో ఇసుక తరలిపోతుంటే భూగర్భ జలాలు అడుగంటిపోయి తాము పూర్తిగా నష్టపోతామని పేర్కొన్నారు. అయినా ఇసుక తరలింపు ఆగలేదు.

పెల్లుబికిన ఆగ్రహం

ఇసుక తరలింపును ఆపాలనే పదేపదే గ్రామస్తులు కోరినా ఆగలేదు. దీంతో గ్రామస్తుల ఆగ్రహం కట్టలుతెచ్చుకుంది. మంగళవారం ఉదయం గ్రామస్తులు అందరూ ఏకం అయ్యి పెద్ద ఎత్తున పెన్నానది పరీవాహక ప్రాంతం వద్దకు వెళ్లారు. ఇసుక తరలింపు ఆపాలంటూ అక్కడున్న వారికి చెప్పారు. అయినా తరలింపుదారులు వినకుండా ఇసుకను తీసుకెళ్లేందుకు సిద్ధం అయ్యారు. దీంతో గ్రామస్తులు దారికి అడ్డంగా నిల్చొని వాహనాలు ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దాదాపు మధ్యాహ్నం వరకు గ్రామస్తులంతా ఏకమై అక్కడే బైటాయించారు. పెన్నానది పరీవాహక ప్రాంతం వద్దనే వంటావార్పు చేపట్టారు. మధ్యాహ్నం వరకు గ్రామస్తులు అంతా అక్కడే ఉండి ఆందోళన కొనసాగించారు.

పోలీసుల నచ్చజెప్పే ప్రయత్నం

నిదనవాడ గ్రామస్తుల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో పెన్నా నది పరీవాహక ప్రాంతం వద్దకు చేరుకున్నారు. సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయకుమార్, తహశీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక తరలింపును అడ్డుకోవాలంటూ తాము ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ నిలదీశారు. ఈ సమయంలో సిఐ, తహశీల్దార్ స్పందిస్తూ ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు శాంతించారు.

పంటలన్నీ ఎండిపోతున్నాయి

నిదనవాడ గ్రామస్తులు.

నిత్యం వందలాది టిప్పర్లతో ఇసుకను తరలించుకుపోతుంటే తమ గ్రామంలో భూగర్భ జలాలు అడుగుంటిపోతున్నాయని నిదనవాడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బోర్లలో నీళ్లులేక దానిమ్మ, చీనీ, మామిడి తదితర తోటలన్నీ ఎండిపోతున్నాయన్నారు. ఇలాగే ఇసుక తరలింపు జరిగితే కనీసం తాగేందుకు కూడా తమ గ్రామంలో నీళ్లు రావన్నారు. పంటలు లేకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యం అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక తరలింపును ఆపించాలని, లేకుంటే తామే ప్రత్యక్షంగా అడ్డుకుంటామని తెలియజేశారు.

అక్రమంగా ఇసుకను ఉపేక్షించం

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

శింగనమల నియోజకవర్గంలోని పెన్నా నది పరీవాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తెలియజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా పెన్నా నుంచి తాడపత్రి వాసులు అక్రమంగా ఇసుకను యంత్రాలు ద్వారా తవ్వుతున్నారని నిదనవాడ గ్రామ రైతులు ఎమ్మెల్యేకి తెలియజేశారు. వెంటనే ఎమ్మెల్యే రెవెన్యూ, పోలీస్ అధికారులతో మాట్లాడి ఇసుక తరలింపు దారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుంటే ఎక్కడికక్కడ అడ్డుకోవాలని కూటమి నాయకులకు ఆమె పిలుపునిచ్చారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంటకరామిరెడ్డి

కూటమీ ప్రభుత్వానికి ప్రాతినిత్యం వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలు అమలు చేయకుండా చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి ఎండగడతామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంటరామిరెడ్డి తెలియజేశారు. మంగళవారం స్థానిక శ్రీనివాసకళ్యాణమటపంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త రంగయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంత మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరుతో ఓట్లు దండుకుని గద్దెనెక్కాక ప్రజలను మోసం చేశారన్నారు. వైసిపి ఆధ్వర్యంలో ఇంటింటకి వెళ్లి కూటమి పాలనలో జరిగిన అన్యాయాన్ని వివరించి చైతన్య పరచాలని నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. న్నారు. ప్రజల మద్దతును కూడగట్టుకుని మంచి పాలన తెచ్చుకుందామన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త రంగయ్య, సీనియర్ నాయకుడు ఉమా మహేశ్వరనాయుడు మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కూటమి నాయకులు లిక్కర్‌లో దోపిడి, ఈ-స్టాంపుల స్కామ్‌లో ఆరితేరారన్నారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు ఎన్నికల ముందు తాను శ్రీమంతుడని, గెలిపిస్తే సొంత డబ్బులతో అభివృద్ధిచేస్తానని నమ్మబలికారన్నారు. ఏడాదిలో ఏమి సాధించారో ప్రజలకు చెప్పాలన్నారు. తాను ఆర్డీటీని రక్షించాలంటూ పాదయాత్ర చేస్తుంటే అడ్డంకులు సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు నరేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్‌తో పాటు నియోజకవర్గంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

11సీట్లకు పరిమితమైనా బుద్ధి రాలేదు..

జగన్‌రెడ్డిపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని 11 సీట్లకు పరిమితం చేసినా జగన్‌రెడ్డికి ఇంకా బుద్ధిరాలేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని పలుకాలనీల్లో చేపట్టిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైతే సంవత్సర కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. ఐదేళ్లలో ఒక్క ఇండస్ట్రీ.. ఒక్క ఉద్యోగమైనా ఇచ్చావా.. అంటూ జగన్ ని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి ఐదు కీలక హామీలు నెరవేర్చారని గుర్తు చేశారు. పోలవరాన్ని నువ్వు పక్కన పెడితే ఏడాదిలోనే 14 వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి.. మళ్లీ ఆ ప్రాజెక్టుకు ఊపిరి పోశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, టిడిపి నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రేషన్ దుకాణానికి వచ్చిన 85ఏళ్ల వృద్ధుడు శ్రీరాములు

వృద్ధులకు రేషన్ పంపిణీపై నిర్లక్ష్యం

దుకాణాల వద్దకు వెళ్తున్న పండుటాకులు

ప్రజాశక్తి-పామిడి

వృద్ధులు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వ్యక్తుల ఇళ్ల వద్దకే రేషన్ బియ్యం పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు ఎక్కడా అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ డీలర్లు ప్రతినెలా 26 నుంచి 30వ తేదీ వరకు వృద్ధులు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారి ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలి. అయితే డీలర్లు మాత్రం ఆదేశాలు ఎక్కడా పాటించడం లేదని వినిపిస్తోంది. పామిడికి చెందిన 80ఏళ్ల వృద్ధుడు శ్రీరాములు ఇటీవల కర్నూలులోని ఓ వైద్యశాలలో ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చాడు. అలాంటి ఆయనకు స్థానిక రేషన్ డీలర్ ఇంటికి వెళ్లి రేషన్ పంపిణీ చేయలేదు. చేసేది లేక శ్రీరాములే రేషన్ దుకాణానికి వచ్చి రేషన్ తీసుకోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి వృద్ధులు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారి ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని వృద్ధులు కోరుతున్నారు.

పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని నేమకల్ గ్రామ సమీపంలో సుమారు రూ.550 కోట్లతో ఏర్పాటు చేయనున్న ధనలక్ష్మి ఐరన్ స్టీల్ పరిశ్రమ ఏర్పాటుపై ఆర్‌డిఒ వసంతబాబు ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముఖ్యంగా నేమకల్లు, పులకుర్, ఇర్దేహాల్ సర్పంచులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ సమీపంలో భూముల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందనాన్రు. పరిశ్రమ నుంచి వచ్చే దుమ్ము ధూళి కారణంగా ప్రజలకు కూడా ఆరోగ్యాలు కూడా దెబ్బతింటాయన్నారు. నీరు కలుషితమై ప్రాణనష్టం కూడా కలిగే అవకాశం ఉందని వాపోయారు. రాయదుర్గం సిఐ వెంకటరమణ ఆధ్వర్యంలో బొమ్మనహాల్, డి.హీరేహాల్ ఎస్ఐలు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ డి.హీరేహాల్, బొమ్మనహాల్ తహశీల్దార్లు శ్రీనివాసులు, మునివేలు, ఎస్ఐ నబిరసూల్, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతబాబు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు మంగళవారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర అధ్యక్షులు వెంకటనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నా 13వేల మందికిపైగా ఉన్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.13వేల వేతనంతో కుటుంబాలు ఎలా గడుస్తామని ప్రశ్నించారు. ఇంటి అద్దెలు, విద్య, వైద్యం, అన్నిరకాల ఖర్చులు పెరిగిపోయాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లినా చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న కోట్లాదిమంది ప్రజలకు నిత్యం సేవలందిస్తున్నారన్నారు. వారి శ్రమను ఇప్పటికైనా గుర్తించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని, చనిపోయినా, అనారోగ్య పాలైన కుటుంబాల్లో ఉద్యోగం కల్పించాలని, ఆప్కాస్ రద్దు చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించి కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 4వతేదీన చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, హెల్త్ సెక్షన్ నాయకులు, లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసమ్మ, ఎర్రిస్వామి, నాగేంద్ర, శివన్న, సుబ్బిరెడ్డి, మురళి, తులసి, అరుణ, వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించండి..

12 రోజులుగా స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులతో కమిషనర్ బాలస్వామి మంగళవారం చర్చలు జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం, డిఎంఎ ఆదేశాల మేరకు వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమ్మె విరమించి సహకరించాలని కోరారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఓ కమిటీ ఏర్పాటు చేశారని.. వారు చర్చించి తగు నిర్ణయం తీసుకుంటారని కార్మికులకు అధికారులు వివరించారు. ఇందుకు కార్మికులు, యూనియన్ నాయకులు స్పందిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తాము ధర్నా కొనసాగిస్తున్నామని వారి అనుమతి ఆదేశాలు లేకుండా సమ్మె విరమించలేమని తేల్చి చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను వివరించామని.. పాటించకుంటే తదుపరి ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాల్సి వస్తుందనిస్పష్టం చేశారు. ఈ చర్చల్లో సూపరింటెండెంట్ ఇంజినీర్ షాకీర్‌హుస్సేన్, డిఇఇలు, అసిస్టెంట్ ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

గుత్తి : తమ న్యాయమైన కోరికలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని తెలిపారు. జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం యూనియన్ అధ్యక్షుడు ఎస్. రాజా, ఉపాధ్యక్షుడు ఎస్ఎ.మురళి, ప్రధాన కార్యదర్శి రవిశంకర్, సహాయ కార్యదర్శులు నరసింహులు, ఆదినారాయణ, కోశాధికారి నక్కా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా

పంపిణీలో ఎమ్మెల్యేలు, నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

సంపాదించలేని స్థితిలో పేదల ఇళ్లు గడవటానికి, కుటుంబ అవసరాలకు ప్రభుత్వం అందజేసే పింఛన్ ఆర్థిక భరోసా ఇస్తోందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పట్టణంలోని 29వ వార్డు పరిధిలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం ఇవ్వనంత మొత్తాన్ని చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్ అందజేస్తున్నట్లు వివరించారు. వృద్ధులకు రూ.4వేలు, వితంతువులు, అంగవైకల్యం ఉన్నవారికి రూ.6వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.10వేలు, కిడ్నీ లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి రూ.15వేలు చొప్పున ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఇంజినీర్ సురేష్, వార్డు సభ్యులు బుల్లారి జ్యోతి, చేనేత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ టి.హనుమంతు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పి.పురుషోత్తం, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్లు గాజుల వెంకటేశులు, కడ్డిపూడి మహబూబ్‌బాషా, మాజీ సభ్యులు ధనార్జున, టిడిపి నాయకులు చెన్నవీర షబ్బీర్, తిప్పేస్వామి, శంకర్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని సీబాయి గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొని పింఛన్‌దారులకు సొమ్ము అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ లక్ష్మీదేవి రమేష్, గోళ్ల సర్పంచు కవిత రామ్మోహన్‌చౌదరి, బుజ్జన్న, వెంకటేశులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కొలువుదీరిన పీర్లు



ప్రార్థనలు చేస్తున్న ముజావర్లు

రాయదుర్గం : మొహర్రం వేడుకల్లో భాగంగా పట్టణంలోని ఆత్మకూరు వీధిలో ఉన్న లడ్డువారి పీర్లచావడిలో పీర్లు కొలువుదీరాయి. ఇందులో భాగంగా ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా ఉత్సవాల్లో ముఖ్యమైన చిన్న సరిగెత్తు గురువారం, పెద్ద సరిగెత్తు ఆదివారం నిర్వహించనున్నట్లు ముజావర్లు లడ్డు మొహమ్మద్ షఫీ, నూర్ మొహమ్మద్, ఖాసిం, జాకీర్ తెలిపారు.

ఇంటింటి చెత్త సేకరణ పరిశీలన



కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

ఉరవకొండ : పట్టణంలో చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ఇంటింటి చెత్త సేకరణ విధానాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జి.శివశంకర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీకి చెందిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్, ఎఒ శంకర్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గూగూడులో డ్రోన్ కెమెరాలతో నిఘా

నార్పల : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాల్లో పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఆలయంతోపాటు పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో పోలీసులు జల్లెడ పడుతున్నట్లు తెలిపారు. డ్రోన్ కెమెరాలతో దొంగలు, ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించవచ్చన్నారు.



గూగూడులో డ్రోన్‌లో తీసిన ఆలయ పరిసరాలు

‘తొలి అడుగు’ను విజయవంతం చేయండి

టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు, విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడుయాదవ్, విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం రాయదుర్గంలోని సీతారామాంజనేయ సత్రంలో టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ యువతను పెడదోవ పట్టించే చర్యలు చేపడుతున్నాడని ఆరోపించారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 2047 సంవత్సరం వరకూ అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివద్ధి సాధ్యమన్నారు. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నెల రోజులపాటు ప్రజా, పార్టీప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరించనున్నట్లు తెలిపారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న దృష్ట్యా పార్టీ పదవులు రాని, పార్టీ కోసం పని చేసిన వారికి పోటీ చేసే అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం పార్టీ ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో మండలాల వారీగా కన్వీనర్ల పదవికి పేర్ల ప్రతిపాదనలను స్వీకరించారు. ఈ సమావేశంలో సంస్థాగత ఎన్నికల పరిశీలకులు భూక్యా కాలేనాయక్, గంపన్న, కొండారెడ్డి, స్వామిదాసు, దలవాయి వెంకటనారాయణ, కృష్ణకుమార్, నాయకులు కేశవరెడ్డి, పురుషోత్తం, నాగరాజు, గిరిమల్లప్ప, నాగల్లి వెంకటేశులు, టంకసాల హనుమంతు, బండి కృష్ణమూర్తి, కురుబ హనుమంతు, వెంకటేశులు, మహబూబ్ బాషా, కాలవ సన్నన్న, షబ్బీర్, సంపత్ కుమారి, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో సుపరిపాలన తొలి అడుగు-ఇంటింటికీ టిడిపి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ తొలి ఏడాదిలో మనం చేసిన అభివృద్ధిని ప్రతిఇంటికీ వెళ్లి వివరించాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ప్రజావేదిక కార్యాలయంలో నేటి నుంచి ప్రారంభం కానున్న ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం



వైద్యులను సన్మానిస్తున్న ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు

ప్రజా ఆరోగ్య వేదిక, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణలో డాక్టర్ కొండయ్య అధ్యక్షతన జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, వైద్యులు వీరభద్రయ్య, ప్రసూన, మురళీకృష్ణ, మనోరంజన్‌రెడ్డి, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆలిండియా కార్యదర్శి జి.మనోహర్, రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నాయకులు ఎజి రాజ్‌మోహన్, ఎఐసిఒడి రాష్ట్ర నాయకులు రంగారెడ్డి, సిఐటియు నగర కమిటీ అధ్యక్షులు వెంకటనారాయణ, మెడికల్ రిప్రజెంటేటివ్స్, జన విజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.

అనంతపురం సిటీ : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం డాక్టర్స్ డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఇబి దేవి, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్‌రావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ యుగంధర్, డాక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణస్వామి, నరేందర్‌రెడ్డి, ఎస్ఒ మహమ్మద్ రఫీ, డెమో త్యాగరాజు, గంగాధర్, హెచ్ఇఒ నాగరాజు, కిషోర్, ఫణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ : పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పిఎస్‌టిలుగా ఎన్నికైన లక్ష్మీనారాయణ, కార్యదర్శి వేదమూర్తి, ట్రెజరర్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యులు గంగాధర, అర్జున్, హర్షవర్ధన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సి టి.గణేష్‌బాబు, వై.ప్రభాకర్‌నాయుడు, సప్తగిరి మల్లికార్జున, సూర్యనారాయణ, కె.బాలచందర్, జయకృష్ణ, నాగేశ్వరరావు, జీకే శ్రీధర్, జయప్రకాష్, నజీర్, జబీర్, గంగాధర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని గుత్తిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని శాంతిప్రియ ఆసుపత్రిలో శ్రీ బాలసుబ్రమణ్యం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎం.శాంతిప్రియను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మల్లికార్జునరావు, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు చౌదరి విజయభాస్కర్, నాయకులు దస్తగిరి, శివ, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్పను లయన్స్ క్లబ్, గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు కరిడికొండ సుధాకర్ నాయుడు, కొలిమి నిజాం తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో డాక్టర్ శాంతిప్రియను సన్మానిస్తున్న వైద్యసిబ్బంది, కల్చరల్ అసోసియేషన్ నేతలు

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

కెవికె శాస్త్రవేత్త శిరీష

ప్రజాశక్తి-ఉరవకొండ



ఉరవకొండ డివిజన్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులు సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కళ్యాణదుర్గం కెవికె శాస్త్రవేత్త శిరీష సూచించారు. మంగళవారం మండలంలోని రాకెట్ల, ఇంద్రావతి గ్రామాలతోపాటు విడపనకల్ మండల పరిధిలోని డోనేకల్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో వేరుశెనగ పొలాలను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం శాస్త్రవేత్త మాట్లాడుతూ వేరుశనగ పంట 30 రోజుల కాలపరిమితిలో ఉందన్నారు. కావున కందిని అంతర పంటగా 16 చాళ్లకు ఒకటి చొప్పున వేసుకోవచ్చన్నారు. అదేవిధంగా జొన్న, మొక్కజొన్న, సజ్జ లాంటి పైర్లను రెండు వరుసల్లో బార్డర్ క్రాప్‌గా వేసుకోవాలన్నారు. దీనివల్ల రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తెల్ల దోమ లాంటి కీటకాలను నివారించడం సులువుగా ఉంటుందన్నారు. విత్తనం మోతాదు తగ్గించమని సూచించారు. ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేయాలన్నారు. వేరుశనగలో మచ్చ తెగులు నివారణకు కాంటాక్ట్ ప్లస్ అనే మందును పిచికారీ చేయాలన్నారు. అలాగే యంత్ర పరికరాల సబ్సిడీ, పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ ఎడిఎ ఎస్.సత్యనారాయణ, ఉరవకొండ, విడపనకల్ మండల వ్యవసాయ అధికారులు రామకృష్ణ, పెన్నయ్య, ఎఇఒ కైలాష్‌నాథ్, బీమా కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు ఎ.రామ్మోహన్, సిసీంద్రి, నరేంద్రప్రసాద్, సుదర్శన్, ఆదినారాయణ, రామాంజనేయులు, ఆనంద్‌నాయక్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : కౌలురైతులు సిసిఆర్‌సి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎఒ లీనావసుంధర సూచించారు. మంగళవారం మండల పరిధిలోని శంకరబండ, పల్లి గ్రామాలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంలో సాగు చేసే ఏ విత్తనానికైనా విత్తన శుద్ధి తప్పనిసరి అన్నారు. ముఖ్యంగా కంది, వేరుశనగ పంటలు సాగు చేసే రైతులకు మూవకుళ్లు తెగులు నివారణపై సమగ్ర శిక్షణ అందించారు. ఇప్పటి వరకు సాగు చేయని రైతులు దుక్కి సేద్యంలో కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానిక ఆర్‌బికె సెంటర్‌లో రైతులకు అవసరమైన వేరుశెనగ విత్తనకాయలు సిద్ధంగా ఉన్నాయన్నారు. తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ మురళి, కృష్ణ, స్నేహితులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-బొమ్మనహాల్



పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగవేణి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని ఐకెపి కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వరకూ పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు తాగునీరు అందిస్తున్న కార్మికులపై కలెక్టర్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పాదయాత్ర చేపట్టి కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటిఐయు నాయకులు ఓబులేష్, శ్రీనివాసులు, ఐకెపి విఒలు సోమశేఖర, వరలక్ష్మి, నరసింహా, తాగునీటి పథకం వర్కర్లు మంజునాథ్ గౌడ, అశోక్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

4న జాబ్ మేళా

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 4 వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన యువతీ,యువకులు ముందుగానే రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. దాదాపు 15 కంపెనీలకు సంబంధించిన హెచ్‌ఆర్‌లు జాబ్‌మేళాలో పాల్గొనిఅర్హులైన యువతీ, యువకులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం.ప్రగతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, కౌన్సిలర్ సతీష్, కళాశాల ప్లేస్ మెంట్ అధికారి డాక్టర్ రవి నాయక్, అధ్యాపకులు ఎల్.ఆర్.రమేష్, పార్వతి, ప్రకాష్ రావు, అశ్వర్థప్ప, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్

ప్రజాశక్తి-శింగనమల

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ సూచించారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని లోలూరు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహనంచాలన్నారు. ప్రతి ఒక్కరూ వారానికి ఒకసారి నిల్వ ఉన్న నీటిని పారబోయాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ గంగాధర్, సూపర్‌వైజర్ చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ అరుణ, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు ఆంజనేయులు, విజయ్, రమణయ్య, ఎఎన్ఎం ప్రమీలమ్మ, ఆశా మదర్‌బీ, తదితరులు పాల్గొన్నారు.



శింగనమల మండలంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

యాడికి : ఈనెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకూ డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మేకలపల్లి గ్రామంలో డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ దేవరాజు ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు ప్రజలకు డెంగీతోపాటు విషజ్వరాలపై వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయలచెరువు మేల్ సూపర్‌వైజర్ షబ్బీర్‌అహ్మద్, మేల్ హెల్త్ అసిస్టెంట్ మొయినుద్దీన్, ఎఎన్ఎం రామలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి ఆశా కార్యకర్త పాల్గొన్నారు.



పొగాకుకు వ్యతిరేకంగా సంతకం చేస్తున్న డిఎంహెచ్ఒ ఇబి దేవి

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

డిఎంహెచ్ఒ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఇబి దేవి సూచించారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి కార్యాలయంలో పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిగరెట్, ఇతర పొగాకు సంబంధింత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉంటూ క్యాన్సర్ వంటి భయానిక వ్యాధులు రాకుండా నివారించుకోవాలన్నారు. అనంతరం పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పొగాకు నియంత్రణ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి, జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ బి. శ్రీరాములు, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ యుగంధర్, పరిపాలన అధికారి గిరిజా మనోహర్, మలేరియా అధికారి ఓబులు, డెమో సిబ్బంది త్యాగరాజు, గంగాధర్, జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు, ఎన్సీడీ సిబ్బంది జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఆంజనేయులు ప్రేమ్, కిషోర్, శశి, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బిటిపి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

త్వరలోనే నియోజకవర్గంలోని భైరవానితిప్ప ప్రాజెక్టు పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సీబాయి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి పథకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగానే హంద్రీనీవా కాలువ వెడల్పు కోసం నిధులు విడుదల చేసి పనులు వేగంగా చేపడుతున్నట్లు వివరించారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పూర్తయితే మరింత ఎక్కువ నీళ్లు జిల్లాకు వస్తాయన్నారు. ఆ నీటిని బీటీపీకి ఉపయోగించుకోవచ్చన్నారు. మన ప్రాంతానికి అత్యవసరమైన పథకం బిటిపి అన్నారు. అయితే గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించకుండా ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈనేపథ్యంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కాలువ కోసం భూములు ఇచ్చిన రైతులను పూర్తిస్థాయిలో గుర్తించి వారికి పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. తర్వాత పనులను ప్రారంభించి బిటిపితోపాటు కుందుర్పి బ్రాంచ్ కెనాల్‌కే నీళ్లు తెస్తామన్నారు.

రీసర్వేలో తప్పిదాలను సరిదిద్దాలని రైతుల ఆందోళన

ప్రజాశక్తి-ఉరవకొండ



ఆందోళన చేస్తున్న రైతులు

భూముల రీసర్వేలో చోటు చేసుకున్న తప్పిదాలను సరిదిద్దాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విడపనకల్లు మండల కేంద్రంలో అనంతపురం-బళ్లారి జాతీయ రహదారిని రైతులు దిగ్బంధించి నిరసన తెలిపారు. అంతకుముందు తహశీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. అనంతరం జాతీయ రహదారి వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రీ సర్వేలో అనేక తప్పిదాలు చోటు చేసుకున్నాయన్నారు. ఒకరు భూమిని మరొకరు పేరుపై.. సర్వే నెంబర్లు.. రైతుల పేర్లు తప్పుగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. భూములు విస్తీర్ణం కూడా ఎక్కువ.. తక్కువగా నమోదు చేశారని ఆరోపించారు. వీటన్నింటినీ సరిదిద్దాలని నెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరికి సిపిఐ నాయకులు సంఘీభావం తెలిపారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఐఎన్‌టిఎస్‌ఒలో ‘శ్రీ చైతన్య’ ప్రభంజనం

ప్రజాశక్తి-అనంతపురం

గతనెలలో జరిగిన ఐఎన్‌టిఎస్ఒ మొదటి దశ పరీక్షలో శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ప్రభంజనం సృష్టించింది. జిటిఎస్ఒ విభాగంలో 27 మంది, ఎస్‌టిఎస్ఒ విభాగంలో 45, ఎటిఎస్ఒ విభాగంలో 35, ఇటిఎస్ఒ విభాగంలో 51, ఎంటిఎస్ఒ విభాగంలో 56 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి రికార్డ్ సృష్టించినట్లు శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపాల్ అమృతవల్లి, డీన్ సత్యనారాయణ, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో సర్పంచి భర్త మృతి



హనుమంతరాయుడు (పాతచిత్రం)

కళ్యాణదుర్గం టౌన్ : పట్టణ సమీపంలోని మల్లాపురం బైపాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బోయాలపల్లి గ్రామ సర్పంచు దుర్గమ్మ భర్త హనుమంతురాయుడు (32) అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హనుమంతురాయుడు కంబదూరు బైపాస్ వైపు నుంచి శ్రీనివాస కళ్యాణ మంటపం వద్దకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అయితే అనంతపురం బైసాప్ వైపు నుంచి వచ్చిన లారీ మల్లాపురం బైపాస్ జక్షన్ వద్ద వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హనుమతురాయుడుకు రెండేళ్ల కుమారుడు యశ్వంత్ ఉన్నాడు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త రంగయ్య, నాయకులు ఉమామహేశ్వరనాయుడు, తిప్పేస్వామి, ఎంపీపీ మారుతమ్మ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరాతీశారు. తర్వాత కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపాన్ని తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట జూదరులు అరెస్టు

యాడికి : మండల కేంద్రంలో 9 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సిఐ ఈరన్న తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని కోట వీధిలోని తేరు మిద్దె వెనుకాల మంగళవారం పెద్ద ఎత్తున సాగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో 9 మంది పేకాటరాయుళ్ల నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, 8 సెల్‌ఫోన్లు, రూ.34100 స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ వెంకట రమణయ్య, ఎఎస్ఐ వెంకటేష్, పోలీసులు శివశంకర్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.